మహిళలు ఆర్థికంగా బలపడాలి : కలెక్టర్

పాలకోడేరు : మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థికంగా బలపడాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శుక్రవారం పాలకోడేరు మండల సమైక్య భవనంలో నిర్వహిస్తున్న బ్యూటీషియన్ కోర్సును పరిశీలించి, బ్యాంకు లింకేజీ, ఉన్నతీకరణపై ఎస్‌హెచ్‌జి మహిళలకు సెర్ప్ ద్వారా అందజేస్తున్న శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిఆర్‌డిఎ, స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బ్యూటీషియన్ కోర్సును జిల్లాలోని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ అనంతరం పిఎంఇజిపి ద్వారా రూ.10 లక్షల వరకూ సబ్సిడీతో కూడిన రుణ సదుపాయాన్ని అందజేయనున్నారు. దీంతో బ్యూటీ పార్లర్ ఏర్పాటు చేసుకోవచ్చని తెలిపారు. బ్యాంకు లింకేజీ, ఉన్నతీకరణపై ఎస్‌హెచ్‌జి మహిళలకు సెల్ఫ్ ద్వారా శిక్షణ కార్యక్రమాన్ని 4 వేల మందికి అందజేయడం జరుగుతుందన్నారు. సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ స్పెషల్ ఆఫీసర్ సరళ మాట్లాడారు. సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్, తహశీల్దార్ విజయలక్ష్మి, డిపిఎంలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

ఎంపిపి ఎన్నికల్లో కూటమి 'జులుం'..!

- వైసిపికి ఎంపిటిసిల బలం ఉండటంతో కుయుక్తులకు తెర
- ఎత్తులు పారకపోవడంతో ఎంపిపి ఎన్నికలు వాయిదా పడేలా వ్యూహం
- అనుకున్నట్లుగానే అత్తిలి, యలమంచిలి ఎంపిపిల ఎన్నిక వాయిదా
- ఘర్షణల నడుమే కైకలూరు వైస్ ఎంపిపి పదవి కూటమి కైవసం

అత్తిలిలో మోహరించిన పోలీసులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రజాస్వామ్యయుతంగా జరగాల్సిన మండల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో కూటమి నేతలు వ్యవహరించిన తీరుపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తున్నాయి. బలం లేకపోయినా ఎంపిపి, వైస్ ఎంపిపి పదవులు దక్కించుకునేందుకు కూటమి నేతలు పన్నిన కుయుక్తులు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా అప్పట్లో వైసిపి వ్యవహార శైలిపై తీవ్ర విమర్శలు గుప్పించిన టిడిపి, జనసేన నేతలు ఇప్పుడు అధికారంలోకి వచ్చాక అదేవిధంగా వ్యవహరించడం ఏమిటని అంతా ప్రశ్నిస్తున్నారు. అప్పుడు వైసిపి ప్రభుత్వానికి, ఇప్పుడు కూటమి ప్రభుత్వానికి తేడా ఏమిటనే చర్చ సాగుతోంది. ఖాళీ అయిన అత్తిలి, యలమంచిలి ఎంపిపి పదవులకు, కైకలూరు, ఏలూరు రూరల్ వైస్ ఎంపిపి పదవుల ఎన్నికలకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. దాని ప్రకారం ఈ నెల 27న ఎన్నిక ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. తొలిరోజు అన్నిచోట్లా ఎన్నిక వాయిదా పడింది. రెండోరోజు 28వ తేదిన సైతం అత్తిలి, యలమంచిలి ఎంపిపిల ఎన్నిక మాత్రం జరగలేదు. ఘర్షణల నడుమ కైకలూరు వైస్ ఎంపిపి పదవిని కూటమి దక్కించుకుంది. ఏలూరు వైస్ ఎంపిపి పదవిసైతం కూటమి ఖాతాలో పడింది.

బలం లేకపోయినా పదవుల కోసం యత్నం

అత్తిలి మండలపరిషత్‌లో మొత్తం 20 ఎంపిటిసి స్థానాలకుగాను 16 వైసిపి, రెండు చోట్ల టిడిపి, రెండు చోట్ల జనసేన గెలిచాయి. కొంతకాలం క్రితం పరిణామాలతో టిడిపి, జనసేన బలం ఆరుకు చేరింది. వైసిపికి బలం 13కు తగ్గింది. వైసిపి ఎంపిటిసిలను ఎంతో ప్రలోభపెట్టినా లొంగకపోయేసరికి టిడిపి నేతలు ఎంపిపి ఎన్నిక జరగకుండా కుయుక్తులు పన్నినట్లు తెలుస్తోంది. అత్తిలి మండల పరిషత్ కార్యాలయం వద్ద ఏకంగా వందమందికిపైగా పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. వైసిపి ఎంపిటిసిలను మండల పరిషత్ కార్యాలయానికి రాకుండా ఎక్కడికక్కడే టిడిపి నేతలు మోహరించారు. దీంతో 27వ తేదీ జరగాల్సిన ఎన్నిక 28వ తేదీకి వాయిదా పడింది. పరిస్థితిలో ఎటువంటి మార్పు లేకపోవడంతో మరోసారి ఎన్నిక వాయిదా పడింది. యలమంచిలి ఎంపిపి ఎన్నికలోనూ ఇదే తరహాలో హైడ్రామా సాగింది. ఈ మండలంలో మొత్తం 17 మంది ఎంపిటిసిలకుగాను 13 మంది వైసిపి తరపున, టిడిపి నుంచి ముగ్గురు, జనసేన నుంచి ఒకరు గెలుపొందారు. తర్వాత వైసిపి ఎంపిటిసి ఒకరు టిడిపిలోకి చేరారు. అయినప్పటికీ వైసిపికి ఇంకా 12 మంది ఎంపిటిసిలు ఉన్నారు. వైసిపి ఎంపిటిసిలను దారికి తెచ్చుకునేందుకు అక్కడి టిడిపి నేతలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదని తెలిసింది. దీంతో మండల పరిషత్ కార్యాలయం వద్ద టిడిపి నేతలతో ఘర్షణ వాతావరణం సృష్టించి ఎన్నికలు వాయిదా పడేలా చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. రెండోరోజు శుక్రవారం ఎన్నికల అధికారి ఎ.శ్రీనివాసరావు అస్వస్థతకు గురవడంతో టిడిపి నేతల వ్యూహంలో భాగమే అనే చర్చ సాగుతోంది.

కైకలూరులోనూ 22 మంది ఎంపిటిసిలకు ఒక్కచోటే టిడిపి గెలిచింది. మిగిలిన వారంతా వైసిపి ఎంపిటిసిలే. అక్కడ వైస్ ఎంపిపి మరణించడంతో ఎన్నిక వచ్చింది. కూటమి అధికారంలోకొచ్చాక వైసిపి నుంచి గెలిచిన సగం మంది ఎంపిటిసిలు కూటమిలో చేరిపోయారు. దీంతో బలం సమానంగా మారింది. వైసిపి నుంచి ఒక ఎంపిటిసి ఎన్నికకు రాకుండా కూటమి నేతలు అడ్డుకోవడంతో ఘర్షణలు జరిగి 27వతేదీ ఎన్నిక వాయిదా పడింది. శుక్రవారం ఘర్షణల నడుమ వైస్ ఎంపిపి పదవిని కూటమి దక్కించుకుంది. వైస్ ఎంపిపిగా జనసేనకు చెందిన మంగిన రామకృష్ణ ఎన్నికయ్యారు.

జర్నలిస్టులపై దాడులు

ఎంపిపి, వైస్ ఎంపిపి ఎన్నికల సందర్భంగా కూటమి నేతలు జర్నలిస్టులపై దాడులు చేయడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అత్తిలిలో మండల పరిషత్ కార్యాలయం వద్ద సాక్షి కెమెరామెన్‌ను తోసేయడంతో కెమెరా ధ్వంసమైంది. కైకలూరులో భవ్య న్యూస్ రిపోర్టర్‌పై కూటమి నేతలు దాడ చేయడంతో అతనికి తీవ్ర గాయాలై ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. జర్నలిస్టులపై దాడులను జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

హైడ్రామా..!

యలమంచిలి, అత్తిలి ఎంపిపి ఎన్నికలు మరోసారి వాయిదా

ప్రజాశక్తి - యలమంచిలి

వైసిపి నాయకులు గుర్తు తెలియని నెంబర్ల నుండి ఫోన్ చేసి ఎంపిపి ఎన్నికల్లో తమకు సహకరిస్తే ఒక్కొక్కరికి రూ.పది లక్షలు ఇస్తామని, మద్దతివ్వకుంటే అంతుచూస్తామని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని కూటమి ఎంపిటిసిలు ఆరోపించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి ఎన్నిక ప్రక్రియ చేపట్టగా కూటమి ఎంపిటిసిల వ్యూహంతో గందరగోళం నెలకొంది. దీన్ని వైసిపి సభ్యులు ప్రతిఘటించడంతో వాగ్వివాదం చోటుచేసుకుంది. ఆ సమయంలో ఇలా గొడవలైతే ఎన్నికలు సజావుగా సాగవని, తనకు గుండెల్లో నొప్పి వస్తుందని హాలులో నుండి ఎన్నికల అధికారి ఎం.శ్రీనివాసరావు బయటకు వెళ్లిపోయారు. ఈ క్రమంలో ఎంపిపి ఎన్నిక మరోసారి వాయిదాపడింది. వెనువెంటనే కూటమి సభ్యులు కార్యాలయం నుండి బయటకు వచ్చి మీడియాతో మాట్లాడి వెళ్లిపోయారు. అయితే ఎన్నికల ప్రక్రియకు కోరం ఉన్నందున ఎన్నిక జరిగే వరకు తాము ఇక్కడి నుండి కదిలేది లేదని వైసిపి ఎంపిటిసిలు సుమారు రెండు గంటలపాటు కార్యాలయంలోనే ఉన్నారు. అయితే ఎన్నికల అధికారి శ్రీనివాసరావు హైబీపీతో వచ్చి స్పృహ తప్పారని, ఆయనకు చికిత్స చేయించామని, ఆయనకు విశ్రాంతి అవసరమని ఇతర కార్యాలయ అధికారులు చెప్పడంతో చేసేదేమీ లేక వైసిపి సభ్యులు అక్కడి నుండి వెనుదిరిగారు. మరో ఆరు మాసాలకుగాని ఎంపిపి ఎన్నిక జరిగే అవకాశం లేదని, గతంలో వైసిపి అధికారంలో ఉండగా ఇదే పంథాను కొనసాగించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా అదే పంథాను అనుసరిస్తుందని పలువురు పరిశీలకులు వ్యాఖ్యానించారు.


యలమంచిలి: వైసిపి ఎంపిటిసిలతో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్

దమ్ముంటే పోటీ చేసి గెలవాలి: ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్

కూటమి నాయకులకు దమ్ముంటే పోటీ చేసి గెలవాలిగాని అప్రజాస్వామిక పద్ధతులతో ఎన్నికలు వాయిదా వేయించడం సరైన పద్ధతి కాదని వైసిపి ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అన్నారు. ఎన్నికల కేంద్రం నుండి ఎంపిటిసి సభ్యులతో కలిసి వెనుదిరిగిన ఆయన మీడియాతో మాట్లాడారు. అధికారులను పావుగా వాడుకుని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని, 12 మంది ఎంపిటిసి సభ్యులు తమకు ఉన్నారని, ముగ్గురు టిడిపి, ఒక జనసేన ఎంపిటిసిలను కొనుగోలు లేదా బెదిరించాల్సిన అవసరం ఎంతమాత్రం తమకు లేదని అన్నారు. ఎన్నికల అధికారి శ్రీనివాసరావుపై చట్టపరంగా చర్యలు కోరుతూ ముందుకెళ్తామని తెలిపారు.

అత్తిలి: నాటకీయ పరిణామాల మధ్య ఎంపిపి ఎన్నిక మరోసారి వాయిదా పడింది. శుక్రవారం రెండో రోజు ఎన్నిక సమయం మించినా ఒక్క ఎంపిటిసి కూడా హాజరు కాకపోవడంతో ఎన్నిక వాయిదాపడింది. అత్తిలి మండల పరిషత్‌లో మొత్తం 20 మంది ఎంపిటిసిలు ఉండగా టిడిపి ఇద్దరు, జనసేన ఇద్దరు ఎంపిటిసిలు ఉన్నారు. వైసిపి ఎంపిటిసిలు 16 మంది ఉన్నారు. అప్పట్లో రెండున్నరేళ్ల ఒకరు, మరో రెండున్నరేళ్ల మరొకరు ఎంపిపి పదవి చేపట్టాలని నేతలు నిర్ణయం తీసుకున్నారు. ఎంపిపిగా బాధ్యతలు చేపట్టిన మక్కా సూర్యారావు తన గడువు ముగియడంతో ఎంపిపి పదవికి రాజీనామా చేసి కూటమి అధికారంలోకి రాగానే వైసిపికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. మరో ఎంపిటిసి విదేశాల్లో ఉండి సమావేశాలకు రాకపోవడంతో డిస్ క్వాలిఫై అయ్యారు. ఉరదాళ్లపాలేనికి చెందిన మరో వైసిపి ఎంపిటిసి అంశం అనిశ్చితంగా ఉండటంతో వైసిపి బలం 13కు తగ్గింది. రెండోరోజు కూడా అత్తిలిలోని ప్రధాన కూడళ్లలో కూటమి నాయకులు మోహరించారు. పలుచోట్ల ఎంపిటిసిలు కన్పించడం లేదు అంటూ ఎంపిటిసిల ఫొటోలు ముద్రించిన పేపర్లతో వాహనాలు తనిఖీ చేయడం చర్చనీయాంశమైంది. శుక్రవారం ఎఎస్‌పి, డిఎస్‌పి ఆధ్వర్యాన పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. ఈ క్రమంలో ఎంపిటిసిలెవ్వరూ సమావేశానికి రాకపోవడంతో ఎన్నిక ప్రక్రియ రద్దు చేసినట్లు ఎన్నికల అధికారి కె.మురళీకృష్ణ ప్రకటించారు.

తాడేపల్లిగూడెం ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా మంగాభాయ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెం మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా జనసేన నాయకులు చాపల రమేష్ సతీమణి చాపల మంగాభాయ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకమైన తాడేపల్లిగూడెం మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా తనను నియమించేందుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్‌కు, కూటమి నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. తాడేపల్లిగూడెం మార్కెట్ యార్డును అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి తన శాయశక్తులా కృషి చేస్తానన్నారు.

తణుకు ఎఎంసి ఛైర్మన్‌గా కొండేటి శివ

ప్రజాశక్తి - తణుకు

తణుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా కొండేటి శివ నియమితులయ్యారు. ఈ సందర్భంగా శివ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి తగిన గుర్తింపు ఉంటుందనడానికి నిదర్శనం తనకు పదవి దక్కడమేనన్నారు. తనకు పదవి కట్టబెట్టినందుకు తణుకు ఎంఎల్‌ఎ ఆరిమిల్లి రాధాకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉంగుటూరు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా జ్యోతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా జనసేన నేత సూరత్తుల అయ్యప్ప భార్య కారేటి జ్యోతి నియమితులయ్యారు. ఎఎంసి ఛైర్‌పర్సన్ అభ్యర్థులుగా టిడిపి నుంచి బిసి మహిళ, జనసేన నుంచి బిసి మహిళ పేర్లను ఎంఎల్‌ఎ ధర్మరాజు ప్రభుత్వానికి సిఫార్సు చేశారు. అయితే కూటమి పొత్తులో భాగంగా ఎఎంసి పదవి జనసేనకు కేటాయించడంతో కారేటి జ్యోతి పేరు ఖరారైంది.

పిన్న వయస్సులో ఛైర్‌పర్సన్ పదవి

ఉంగుటూరు మండలం నాచుగుంట పంచాయతీ కొత్తగూడేనికి చెందిన కారేటి జ్యోతి బికాం కంప్యూటర్ విద్య అభ్యసించారు. ఆమె వయసు 22 ఏళ్లు. అతి పిన్న వయస్సులో రాజకీయంగా ఎంతో ప్రాముఖ్యత ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా జ్యోతి ఎంపిక కావడం పట్ల జనసేన శ్రేణులు, ఆమె స్వగ్రామ వాసులు హర్షం వ్యక్తం చేశారు.

వినతులను డిప్యూటీ సిఎం దృష్టికి తీసుకెళ్తాం

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రజల నుండి వచ్చిన వినతులన్నింటినీ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజ అన్నారు. స్థానిక లక్ష్మీ వెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు శుక్రవారం గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వినతులన్నింటిపై డిపిఆర్ సిద్ధం చేసి నివేదిస్తామన్నారు. ప్రాధాన్యతాక్రమంలో ఆ సమస్యలన్నీ పరిష్కరిస్తారన్నారు. అనంతరం ఎంఎల్‌ఎ బొమ్మిడి నాయకర్ మాట్లాడారు. మొగల్తూరులో పరిశ్రమ ఏర్పాటు చేసి ఉపాధి ఉద్యోగ అవకాశాలు మెరుగు పరచాల్సి ఉందన్నారు. కోనాయికోడు ప్రక్షాళనకు చర్యలు చేపడతామన్నారు. కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు మాట్లాడుతూ మొగల్తూరు పంచాయతీని నగర పంచాయతీగా అభివృద్ధి చేసే స్థాయి ఉందన్నారు. మాజీ సర్పంచి మామిడిశెట్టి సత్యనారాయణ, మాజీ ఉప సర్పంచి కలిదిండి కుమార్‌బాబు, డొల్ల రత్నం రాజు, రైతు పువ్వాడ శేషగిరి, కైలా నరేష్ గ్రామంలోని సమస్యలు వివరించారు. అనంతరం కృష్ణతేజ, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డిలను గజమాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ మధుసూదన్‌రావు, సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ, ఒఎస్‌డి కె.వెంకటేష్, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్న, జెడ్‌పిటిసి తిరుమాని బాపూజీ, వైస్ ఎంపిపి కైలా సుబ్బారావు, డిఇలు సత్యనారాయణ, శ్రీనివాసరావు కిరణ్ కుమార్, ఎంపిడిఒ సిహెచ్.త్రిశూలపాణి, తహశీల్దార్ కె.రాజకిషోర్, ఇఒఆర్‌డి మేడిది నవీన్ కిరణ్, పంచాయతీ కార్యదర్శి ముచ్చర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొగల్తూరు: మాట్లాడుతున్న కృష్ణతేజ

పెనుగొండ: పెనుగొండ గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తుందని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో గ్రామాభివృద్ధి సభ నిర్వహించారు. ఇంజినీరింగ్ కాలేజీ ఏర్పాటు, కేన్సర్‌కు సంబంధించిన నిర్ధారణ పరీక్షలు, గుండెకు సంబంధించిన వైద్యం, డిగ్రీ కళాశాలకు నాలుగు చక్రాల వాహనాలు వెళ్లేలా వంతెన నిర్మాణం, బస్టాండు అభివృద్ధి, పరిశ్రమల ఏర్పాటు తదితర అంశాలను పలువురు ప్రస్తావించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, డిపిఒ అరుణశ్రీ, గ్రామ సర్పంచి నక్క శ్యామలసోనీ శాస్త్రి, జెడ్‌పిటిసి పోడూరి గోవర్ధన్, తహశీల్దార్ జి.అనితకుమారి, ఎంపిడిఒ టి.సూర్యనారాయణమూర్తి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ భారాలు వేయడంలో ఇద్దరూ ఇద్దరే

భీమవరం :నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

- ఛార్జీలు తగ్గించకపోతే ఆందోళన తప్పదు
- సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్
- విద్యుత్ సబ్ స్టేషన్ల వద్ద సిపిఎం ఆధ్వర్యాన ఆందోళనలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రజలపై విద్యుత్ భారాలు వేయడంలో గత ముఖ్యమంత్రి జగన్‌కు, ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబుకు మధ్య ఎటువంటి తేడా లేదని, ఇద్దరూ ఇద్దరేనని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విమర్శించారు. నాడు అదాని ఒప్పందాలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ధ్వంసం చేయాలని కూటమి నేతలు అన్నారని, అధికారంలోకి వచ్చాక వాటినే కొనసాగించడం సిగ్గుచేటని అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గోపాలన్ మాట్లాడుతూ గతంలో ప్రపంచబ్యాంకు ఒప్పందాల పేరుతో ప్రజలపై భారాలు వేసి అధికారాన్ని కోల్పోయిన బాబు ఇప్పుడు మళ్లీ కేంద్ర ప్రభుత్వానికి వంత పాడుతూ గత ప్రభుత్వం అనుసరించిన విధానాలనే కొనసాగిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వ ఒప్పందాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కూటమి మాట మార్చిందన్నారు. విద్యుత్ వినియోగదారులు బిల్లులు చెల్లించలేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. తక్షణమే విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, ప్రజలకిచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని, లేనిపక్షంలో మరో విద్యుత్ ఉద్యమానికి నాంది పలుకుతామని హెచ్చరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు మాట్లాడారు. అనంతరం విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు డి.కళ్యాణి, ఎం.రామాంజనేయులు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, ఎం.ఆంజనేయులు, డేగల నాగేశ్వరరావు, కృష్ణ, బొక్కా సత్యనారాయణ, త్రిమూర్తులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: ట్రూఅప్ ఛార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్ భారాలు మోపొద్దని, పెంచిన విద్యుత్ భారాలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యాన శుక్రవారం స్థానిక జయలక్ష్మి థియేటర్ వద్ద ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా ఆందోళన చేపట్టారు. అనంతరం ఎఇకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల పేరుతో మరోసారి రాష్ట్ర ప్రజలపై భారాలు మోపడాన్ని ఖండించారు. గత ప్రభుత్వ హయాంలో బాదుడే బాదుడు కార్యక్రమం నిర్వహించి తాము అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్ భారాలు తగ్గిస్తామని, స్మార్ట్ మీటర్లు రద్దు చేస్తామని ప్రగల్భాలు పలికి, అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వం కంటే ఎక్కువ విద్యుత్ భారాలు కూటమి మోపుతోందని అన్నారు. స్మార్ట్ మీటర్లు శరవేగంగా బిగిస్తున్నారని విమర్శించారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపును వెంటనే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జవ్వాది శ్రీను, సత్తి కోదండరామిరెడ్డి, మీసాల శ్రీను, దేశంశెట్టి సతీష్, పెనుగంటి దుర్గ, నరమాల కృష్ణ, యడవల్లి వెంకట దుర్గారావు, పోతు శ్రీను, శిద్దిరెడ్డి శేషుబాబు, తేతలి నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భీమవరం టౌన్: విద్యుత్ భారాలను వెంటనే ఉపసంహరించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని తాడేరు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం సిపిఎం ఆధ్వర్యాన ధర్నా నిర్వహించారు. అనంతరం జూనియర్ అసిస్టెంట్ గోవిందరాజుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టెం శుభకరరావు, పాలపర్తి జ్ఞానరాజ్, పాలపర్తి ఛార్లెస్, నేతల కృపాదానం, భూపతి శామేలు రత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఉండి: అదనపు, సర్దుబాటు ఛార్జీల పేరిట పెంచిన విద్యుత్ ఛార్జీలను వెంటనే తగ్గించాలని సిపిఎం నాయకులు ధనికొండ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. మండల కార్యదర్శి చీర్ల శేషు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ధనికొండ శ్రీనివాస్, కిలారి తవిటినాయుడు, కొట్టాడ వెంకటేశ్వరరావు మాట్లాడారు. కార్యక్రమంలో రామకూరి వెంకటరత్నం, చీర్ల శ్రీనివాస్, నక్కా వెంకటేశ్వర్లు, పెళ్లూరి సుబ్రహ్మణ్యం, మోపిదేవి రాము, విజయరామరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురంలో..

గణపవరం: ప్రజలపై విద్యుత్ భారాలు వేయబోమని చెప్పి అధికారంలోకి వచ్చాక ఎడపెడా భారాలు మోపడం కూటమి ప్రభుత్వానికే చెల్లిందని, తక్షణం ఆ భారాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జక్కంశెట్టి సత్యనారాయణ, మండల కార్యదర్శి పెచ్చెట్టి నరసింహమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం పిప్పర విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద చేపట్టిన ధర్నాలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎం.పెంటారావు, చిన్నం చిన నాగేశ్వరరావు, నరాలశెట్టి రామకృష్ణ, పి.గోవింద్, సోడదాసి సంజీవరావు, పలివెల బాలయ్య పాల్గొన్నారు.

వీరవాసరం: గత ప్రభుత్వం అదానీతో చేసుకున్న అన్ని ఒప్పందాలను కూటమి ప్రభుత్వం రద్దు చేయకుండా అమలు చేయడాన్ని సిపిఎం జిల్లా నాయకులు జుత్తిగ నరసింహంమూర్తి తీవ్రంగా విమర్శించారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం చేపట్టిన నిరసననుద్దేశించి ఆయన మాట్లాడారు. ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకొచ్చిన కూటమి ప్రభుత్వం తొమ్మిది నెలల్లోనే రెండుసార్లు రూ.15,485 కోట్ల సర్దుబాటు ఛార్జీలు భారాన్ని వేసి ముక్కుపిండి వసూలు చేయడం దారుణమన్నారు. తక్షణం భారాలు ఉపసంహరించుకోవాలని, విద్యుత్ స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బొర్రా అలమహారాజు, నేతలు పోతుల మృత్యుంజయ, బాలం విజయ్‌కుమార్, యండమూరి సుబ్బారావు, కేతా జ్యోతిబసు, యాళ్లబండి నారాయణమూర్తి, అయినపూడి బాబూరావు, కిలాడి సత్యనారాయణ, పాలా కోటేశ్వరరావు, లింగం సత్యనారాయణ, జుత్తిగ శ్రీనివాస్, బి.విజయకుమార్ పాల్గొన్నారు.

తణుకు రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజలకు విద్యుత్ భారాలు తప్పడం లేదని సిపిఎం వేల్పూరు గ్రామ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం షిఫ్ట్ ఆపరేటర్ ఎన్.సత్యకృష్ణకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యండమూరి నాగేంద్ర, దున్నే రుద్ర నాగేశ్వరరావు, కె.వీరభద్రరావు, వాసా పోసియ్య, విశ్వనాథం సుబ్బారావు పాల్గొన్నారు.

గణపవరంలో..

పాలకోడేరు: ప్రజలపై విద్యుత్ భారాలు ఉపసంహరించుకోవాలని సిపిఎం ఆధ్వర్యాన పాలకోడేరు, మోగల్లు, విస్సాకోడేరు గ్రామాల్లో సబ్‌స్టేషన్ల వద్ద శుక్రవారం ధర్నాలు నిర్వహించారు. అనంతరం విద్యుత్ శాఖాధికారులకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి శేషపు అశ్రియ్య మాట్లాడారు. కార్యక్రమాల్లో నాయకులు కలిదిండి గోపాలరాజు, దున్న మరియమ్మ, పాలా వెంకటస్వామి, రాఘవులు, గుత్తుల దుర్గ, వీరవల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నరసాపురం: ట్రూఅప్, సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్లు ఉపసంహరించాలని కోరుతూ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సిపిఎం ఆధ్వర్యాన నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ కార్యదర్శి ముచ్చర్ల త్రిమూర్తులు మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సెకీ ఒప్పందాలపై విమర్శ చేసి నేడు అధికారంలోకి వచ్చాక నోరు మెదపట్లేదని విమర్శించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని విద్యుత్ శాఖాధికారి బి.మాధురిదేవికి అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి జల్లి రామ్మోహన్ రావు, నేతలు మంచిలి నీలకంఠం, నోముల కొండ, కోడి లక్ష్మణ్, వాసా రామలింగం, పున్నాని అప్పలనాయుడు, పొన్నాడ మల్లేష్, గట్టుం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు: సెకీ విద్యుత్ ఒప్పందం రద్దు చేసి స్మార్ట్ మీటర్లను ఉపసంహరించాలని సిపిఎం మండల కన్వీనర్ జవ్వాది శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ఇండోర్ విద్యుత్ కేంద్రం వద్ద ధర్నా చేసి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో చల్లా సోమేశ్వరరావు, తిరుమాని శ్రీనివాస్, ఎస్.పురుషోత్తం, వై.అజయ్‌కుమార్, గుబ్బల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

యలమంచిలి: విద్యుత్ భారాలు ఉపసంహరించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఇకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి కానేటి బాలరాజు మాట్లాడారు. కార్యక్రమంలో బాతిరెడ్డి జార్జి, గొల్ల ఏడుకొండలు శ్రీనివాస్, ఎడ్ల మోహన్‌రావు, మాచవరపు సుబ్బారావు, దేవ సుధాకర్, గూడూరు ఆంజనేయులు, సరిపల్లి జయప్రభ, బాతిరెడ్డి సుగుణ, గంటా యేసు, బూసి రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

వీరవాసరంలో..

ఆకివీడు: సర్దుబాటు ఛార్జీల పేరిట విద్యుత్ భారాలను మోపడాన్ని నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏరియా కార్యదర్శి కె.తవిటినాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో పెంకి అప్పారావు, బివి.వర్మ, డోకల రవితేజ, డోకల లక్ష్మి, బి.రాంబాబు, బి.కళ్యాణి, గోపిశెట్టి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆచంట: విద్యుత్ భారాలు నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం స్థానిక మార్కెట్, విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి పి.మోహన్‌రావు మాట్లాడారు. అనంతరం విద్యుత్ అధికారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్‌వి‌ఎన్.శర్మ, సిర్రా నరసింహమూర్తి, కుసుమే జయరాజు, తలుపూరి బుల్లబ్బాయి, బండి రంగారావు, కొండేటి సత్యనారాయణ, నెక్కంటి కృష్ణమూర్తి, చదలవాడ చంటిబాబు శ్రీపాద ప్రజ్వల, శ్రీపాద ప్రభావ, కారం చినబాబు, నిమ్మన సత్యనారాయణ, చదలవాడ రామారావు పాల్గొన్నారు.

కాళ్ల: స్మార్ట్ మీటర్లు మాకొద్దంటూ సిపిఎం ఆధ్వర్యాన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి గొర్ల రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మండా సూరిబాబు, తిరుమల శ్రీను, వాతాడ జేజి, గండికోట వెంకటేశ్వరరావు, వెంకమ్మ, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

గుర్రపు డెక్కతో వస్తువుల తయారీ : కలెక్టర్

ప్రజాశక్తి - పాలకోడేరు

జిల్లాలోని మహిళలు గుర్రపు డెక్క ద్వారా వర్మీ కంపోస్ట్, వివిధ వస్తువులు తయారు చేసి, మార్కెటింగ్ చేసేందుకు సిద్ధంగా ఉండాలని, దీనికి సంబంధించి చర్యలను వేగవంతం చేయాలని డిఆర్‌డిఎ పీడీని కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ నాగరాణి గొల్లలకోడేరు వంతెన వద్ద డ్రెయిన్‌లో ఉన్న గుర్రపు డెక్కను పరిశీలించి అక్కడున్న మహిళలతో గుర్రపు డెక్కను సద్వినియోగం చేసుకుని ఎలా ఆదాయం పొందొచ్చో వివరించారు. గుర్రపు డెక్క సాగునీటి ప్రవాహానికి ఆటంకంగా ఉండడంతో పాటు వరదల సమయంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని గుర్తుచేశారు. దీన్ని నివారించేందుకు ఆలోచన చేసి గుర్రపు డెక్కను వినియోగించి వర్మీ కంపోస్ట్, ప్రత్యామ్నాయ వస్తువులను రూపొందించేందుకు డిఆర్‌డిఎ, వ్యవసాయ శాఖలను సన్నాహక చర్యలకు ఆదేశించడం జరిగిందన్నారు. చాప్ కట్టర్స్‌తో గుర్రపు డెక్కను ముక్కలుగా కట్ చేసే తాలికంలో వర్మీ కంపోస్ట్ తయారు చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, తహశీల్దార్ విజయలక్ష్మి, ఇఒపిఆర్‌డి రామ్ ప్రసాద్, ఇరిగేషన్ ఎఇ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేస్తేనే విజయం

కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ

ప్రజాశక్తి - భీమవరం టౌన్

సమన్వయం, పర్యవేక్షణ ఉండి చిత్తశుద్ధితో పనిచేస్తే ఏ కార్యక్రమమైనా విజయవంతం అవుతుందని ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ తెలిపారు. శుక్రవారం స్థానిక విష్ణు ఇంజినీరింగ్ కళాశాల ఆవరణ ఆడిటోరియంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాస వర్మ అధ్యక్షతన జిల్లా అభివృద్ధి సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమన్వయం, పర్యవేక్షణతో అధికారులు అంకితభావంతో పనిచేస్తే ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో పేదలకు చేరుతాయన్నారు. కొంతమంది జిల్లా అధికారులు హాజరు కాకపోవడం, కొంతమంది జిల్లా అధికారుల తరుపున వారి ప్రతినిధులను పంపడం పట్ల కొంత అసహనాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును పై సమీక్షించే సమావేశాలకు జిల్లాస్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని, అధికారులు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. అధికారులు వారి వ్యక్తిగతంగా ఇష్టానుసారం నిర్ణయాలు తీసుకోకుండా ప్రోటోకాల్ ప్రకారం నిబంధన మేరకు పనిచేయాలన్నారు. ప్రభుత్వ పథకాల ప్రగతి గురించి స్థానిక ప్రజాప్రతినిధులకు వివరించాలన్నారు. జిల్లాలో పథకాల అమల్లో భాగంగా శాఖవారీగా చేపట్టే ప్రారంభోత్సవాల సమాచారాన్ని ఎంఎల్ఎలు, ఎంపీ కార్యాలయాలకు విధిగా తెలియజేయాలన్నారు. దిశ కమిటీ సమావేశం రోజువారీ జరిగే సమావేశం కాదని ఈ సమావేశంలో శాఖల వారీగా ప్రభుత్వ పథకాల ప్రగతిని సమీక్షించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు అమలును మరింత వేగవంతం చేసి ప్రగతి సాధించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. కేంద్ర మంత్రి జిల్లా అభివృద్ధికి ఎంతో సహాయం చేస్తున్నారని, ఎన్ ఎం సి ఫండ్స్ నుండి 18.65 కోట్లు అందజేయడం జరిగిందన్నారు. డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు, ఆర్‌డిఒ కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ జెడి జెడ్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని కాపాడాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

మతసామరస్యాన్ని కాపాడాలని కోరుతూ పాలకొల్లులో వివిధ క్రైస్తవ సంఘాలు శుక్రవారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కొవ్వొత్తులతో ప్రదర్శన


కొవ్వొత్తుల ర్యాలీ

నిర్వహించారు. ఏబిసిఎల్ సారధ్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రైవ సేవకుడు ప్రవీణ్ కుమార్ పగడాల అనుమాన మృతిపై చర్యలు తీసుకోవాలన్నారు. ర్యాలీలో పెద్ద సంఖ్యలో ప్రైవ సేవకులు పాల్గొన్నారు.

పసలపేటలో తాటాకిల్లు దగ్ధం

ఆచంట:విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో తాటాకిల్లు దగ్ధమైన సంఘటన ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పసలపేటలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.రెండు లక్షల ఆస్తి నష్టం వాటిల్లింది. దీంతో ఆ కుటుంబ సభ్యులు నిరాశ్రయులయ్యారు. వివరాలు ఎలా ఉన్నాయి. ఆచంట వేమవరం పంచాయతీ పరిధి పసలపేటకు చెందిన సిర్రా శ్రీను బరకాలు కుట్టుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గురువారం రాత్రి సుమారు 11 గంటలకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు రేగాయి. ఆ సమయంలో కుటుంబ యజమాని సిర్రా శ్రీను ఒక్కడే ఇంటిలో పడుకున్నాడు. ఆయన భార్య ఏస్తేరు బంధువుల ఇంటికి ఫంక్షన్‌కి వెళ్లింది. వెళ్లిన ఆమె ఇంకా రాలేదు. శ్రీను నిద్రలో ఉండగా ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఈ ప్రమాదంలో తాటాకిల్లు పూర్తిగా అగ్నికి ఆహుతైంది. స్థానికులు సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో పెనుప్రమాదం తప్పింది. ఇంటిలో సామగ్రితో పాటు రూ.50 వేల నగదు అగ్నికి ఆహుతయ్యాయి. శుక్రవారం ఉదయం రెవెన్యూ అధికారులు బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం అందజేశారు. సర్పంచ్ జక్కంశెట్టి వంటి, పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ ప్రభుత్వ పరంగా నష్టపరిహారం అందజేస్తామని హామీ ఇచ్చారు.

మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

ఫ్యాప్టో చైర్మన్ విజయరామరాజు

ప్రజాశక్తి - భీమవరం

వివిధ సమస్యలతో బాధపడుతున్న ఉపాధ్యాయులను పదో తరగతి మూల్యాంకన విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని ఫ్యాప్టో చైర్మన్ పి.ఎస్.విజయరామరాజు అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణను జిల్లా ఫ్యాప్టో నేతలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి పదో తరగతి మూల్యాంకనానికి సంబంధించిన సమస్యలను వివరించి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఉపాధ్యాయులకు, గర్భిణులు, బాలింత మహిళా ఉపాధ్యాయులకు, 60 ఏళ్ల దాటిన ఉపాధ్యాయులకు, 80 శాతం దివ్యాంగ ఉపాధ్యాయులకు, దూర ప్రాంతాల నుండి వచ్చే ఉపాధ్యాయులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో జనరల్ సెక్రటరీ జి.ప్రకాశం, ఫ్యాప్టో కార్యవర్గ సభ్యులు పిఆర్‌విఎస్.సాయివర్మ, ఎం.శ్రీనివాసరావు, పివిఎస్ఎస్‌బి రమణారావు, కె.వెంకటేశ్వరరావు, ఎరకేశ్వరరావు పాల్గొన్నారు.

భీమవరం అంతా సీసీ రోడ్లే..

రూ.2.58 కోట్లతో నిర్మించిన సీసీ రోడ్లు ప్రారంభించిన ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఎటు చూసినా భీమవరంలో సీసీ రోడ్లే కనిపిస్తాయని ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శుక్రవారం భీమవరంలోని పలు వార్డుల్లో సుమారు రూ.2 కోట్ల 58 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎంఎల్ఎ అంజిబాబు, రాజ్యసభ మాజీ సభ్యులు సీతారామలక్ష్మి ప్రారంభించారు. పట్టణంలోని 23వ వార్డులో రూ.39.50 లక్షలతో బిటి రోడ్డు, 26వ వార్డులో రూ.84 లక్షలతో సీసీ రోడ్డు, రూ.23.40 లక్షలతో బిటి రోడ్డు, 19వ వార్డులో రూ.16 లక్షలతో సీసీ రోడ్డు, 7వ వార్డులో రూ.16 లక్షలతో సీసీ రోడ్డు, 29వ వార్డు గొల్లవానితిప్ప రోడ్డులోని రూ.8.60 లక్షలతో సీసీ రోడ్డు, రూ.28.80 లక్షలతో సీసీ రోడ్డు మొత్తం రూ.2 కోట్ల 58 లక్షలతో సీసీ రోడ్లను ఎంఎల్ఎ అంజిబాబు ప్రారంభించారు. భీమవరం నియోజకవర్గం శరవేగంగా అభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, వీర మహిళలు, ఆయా వార్డుల పెద్దలు, ఇన్‌చార్జులు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ స్వాతికి డాక్టరేట్

భీమవరం టౌన్ :స్థానిక ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న సామంతపూడి స్వాతి పంజాబ్‌లోని నిర్వాన్ యూనివర్సిటీ నుంచి ఇటీవల డాక్టరేట్ అందుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ కెవి.మురళీ కృష్ణంరాజు చెప్పారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం తరఫున వైస్ ప్రెసిడెంట్ ఎస్‌వి రంగరాజు డాక్టర్ స్వాతిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్వాతి మాట్లాడుతూ 'డిజైన్ అండ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ హైస్పీడ్ అర్థమెటిక్ అండ్ లాజిక్ యూనిట్ యూజింగ్ ఫిన్ ఫెట్ టెక్నాలజీ' అంశంపై తాను చేసిన పరిశోధనకు గాను నిర్వాన్ యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రదానం చేసిందన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.జగపతి రాజు, ఇసిఇ ఇన్‌చార్జి హెడ్ ప్రొఫెసర్ పి.వి.ఎస్.పద్మావతి, డాక్టర్ స్వాతిని అభినందించారు.

విద్యార్థులను మహిళా కళాశాలలో చేర్పించాలి

ఆచంట:మండలంలోని వల్లూరు, కరుగోరుమిల్లి, కందరవల్లి, పెనుమంచిలి, భీమలాపురం, మట్టావానిచెరువు, వల్లిపర్రు, గుమ్ములూరు పరిసర ప్రాంతాల్లో 10వ తరగతి పాసైన బాలికలను వల్లూరు ఎంపీ పాలెం మహిళా కళాశాలలో చేర్పించాలని వల్లూరు జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఎంపీపాలెం మహిళా కళాశాల ఇన్‌చార్జి శ్రీధర నరసింహ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థుల సహకారంతో సుమారు రూ.4 లక్షలతో అత్యాధునిక ల్యాబ్ అందుబాటులో ఉన్నాయన్నారు. నూరు శాతం అనుభవజ్ఞులైన లెక్చరర్లతోపాటు మంచి ఉపాధ్యాయులైన ఆట స్థలం, రూ.15 లక్షలతో జెడ్‌పి నిధులతో కొత్తగా నిర్మిస్తున్న ఆడిటోరియం అందుబాటులో ఉండనున్నాయి. అందులో పనిచేసే లెక్చరర్లకే సుమారు వారి సొంత సొమ్ముతో లక్ష రూపాయల వరకూ పెయింటింగ్, కిటికీలకు రిపేర్లకు ఖర్చు చేసి కాలేజీ ఏర్పాటుకు కృషి చేశారన్నారు. అడ్మిషన్లు ప్రారంభించినట్లు ఆయన తెలిపారు.

1న సాంఘిక శాస్త్రం పరీక్ష : డిఇఒ

భీమవరం :పదో తరగతి పబ్లిక్ పరీక్ష షెడ్యూల్ ప్రకారం మార్చి 31న నిర్వహించాల్సిన సాంఘిక శాస్త్రం పరీక్షను రంజాన్ పండుగ సందర్భంగా ఏప్రిల్ 1వ తేదీన నిర్వహించనున్నట్లు డిఇఒ నారాయణ తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, ఎంఇఒలు, అన్ని యాజమాన్య పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించి సమాచారాన్ని అందరికి తెలియజేయాలని తెలిపారు.

మొయ్యేరు సచివాలయంలో జెడ్‌పి చైర్‌పర్సన్ తనిఖీ

గణపవరం:మొయ్యేరు సచివాలయాన్ని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ గంటా పద్మశ్రీ శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. సచివాలయంలో సిబ్బంది లేకపోవడంతో ఎంపిడిఒ ఆర్.బేబీ శ్రీలక్ష్మికి ఫోనుచేసి సిబ్బందికి మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. సచివాలయంలో రికార్డులు పరిశీలించారు.

ఉపాధి కూలీలు 5 గంటలు పని చేయాలనడం దారుణం

గణపవరం:చట్టంలో ఎక్కడా పనిగంటలు లేకపోయినా డ్వామా పీడీ ఉపాధి కూలీలు ఐదు గంటలు పనిచేయాలని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. శుక్రవారం అప్పన్నపేటలో ఉపాధి కూలీలతో మాట్లాడారు. కొన్ని ప్రాంతాల్లో ఆన్‌లైన్ మస్టర్ ఆఫ్ లోడ్ కాకపోవడం వల్ల కూలీలు 11.30 కూడా పని ప్రాంతాల్లో ఉంటున్నారని చెప్పారు. వేతన బకాయిలు వెంటనే విడుదల చేయాలని, సమ్మర్ అలవెన్సులు, పని ప్రాంతాల్లో సౌకర్యాలు కల్పించాలని కోరారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకొల్లు :యునైటెడ్ కాపు సర్వీస్ క్లబ్ 5వ ఆవిర్భావ దినోత్సవం పాలకొల్లు మైలాపూర్ కాఫీ షాప్ వద్ద శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిట్టవరం గ్రామస్తులు ఇటీవల మృతి చెందిన చల్లా సతీష్ (35) కుటుంబానికి రూ.7 వేల సాయం అందజేశారు. అనంతరం యుకెఎస్‌సి ఫౌండర్ పోకల రాము, కో ఫౌండర్ జక్కంపూడి కుమార్‌చే కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ముచ్చర్ల సంజయ్, క్లబ్ గవర్నర్ పెనుమాక రామ్మోహనరావు పాల్గొన్నారు.

కళా పరిషత్‌లను ప్రభుత్వమే నిర్వహించాలి

శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు

వీరవాసరం:కళా పరిషత్‌లను ప్రభుత్వమే నిర్వహించాలని శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. వీరవాసరం కళాపరిషత్ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అఖిల భారత స్థాయి నాటిక పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. ఈ ముగింపు సభకు ముఖ్యఅతిథిగా వచ్చిన మోషేన్‌రాజు మాట్లాడుతూ స్వాతంత్ర పోరాటం కాలంలో సమాజాన్ని చైతన్య పర్చడంలో, సమాజంలోని రుగ్మతలను రూపు మాపడంలో నాటికలు ఎంతో దోహదపడ్డాయన్నారు. కోస్తా భీమవరం పరిసర ప్రాంతాల్లో అధిక సంఖ్యలో కళా పరిషత్‌లు నిర్వహిస్తున్నారంటే గతంలో ఈ ప్రాంతంలో వాటికి ఎంత ఆదరణ ఉందో తెలుస్తుందన్నారు. బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాకా సత్యనారాయణ మాట్లాడారు. అనంతరం కొయ్యే మోషేన్‌రాజు, పాకా సత్య నారాయణ నాటికలను వీక్షించారు. వారిరువురిని కళాపరిషత్ సత్కరించింది. కార్యక్రమంలో గుండా రామకృష్ణ, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, వీరవల్లి చంద్రశేఖర్, ప్రొఫెసర్ గోడి సుధాకర్, పాలా ఆంజనేయులు, రామానుజరావు, లిఖిత పాల్గొన్నారు.

ఉత్తమ ప్రదర్శనగా 'అసత్యం'

అఖిలభారత స్థాయి నాటిక పోటీల్లో ఉత్తమ ప్రదర్శనగా చేతన్య కళాస్రవంతి విశాఖ వారి అసత్యం ఉత్తమ ప్రదర్శనగా నిలిచింది. వివరాలను కళాపరిషత్ అధ్యక్షుడు గుండా రామకృష్ణ శుక్రవారం తెలిపారు. గుంటా రామోహన్‌రావు, అల్లు రామకృష్ణ, గంటా ముత్యాలరావు నాయుడు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించిన ఈ పోటీల్లో ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీకరణం సురేష్ మెమోరియల్ థియేటర్ గుంటూరు వారి తరలమెల్లిపోతున్నదో, తృతీయ ఉత్తమ ప్రదర్శనగా శ్రీనటినట సంక్షేమ సమాఖ్య పాలకొల్లు వారి దేవరాగంలు నిలిచాయి. ఉత్తమ రచన దేవరాగం (కెకె.యరస్వామి), ఉత్తమ దర్శకుడు బాలాజీ నాయక్ (తరమెల్లిపోతున్నదో), ఉత్తమ నటుడు బొమ్మిడి రామకృష్ణ, ఉత్తమ నటి కరణం సరిత, ఉత్తమ ప్రతినాయకురాలు శ్రీజసాధినేని, ఉత్తమ హాస్యనటుడు గుడాల హరిబాబు, ఉత్తమ సంగీతం లీలామోహన్, ఉత్తమ క్యారెక్టర్ నటుడు దములూరి సత్యనారాయణ, ఉత్తమ రంగాలంకరణ శ్రీధర్‌లు ఉన్నారు

మెరుగైన జీవనోపాధికి ప్రత్యేక ప్రణాళిక

భీమవరం:జిల్లా ప్రజానీకానికి మెరుగైన జీవనోపాధిని ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతున్నట్లు కలెక్టర్ చదలవాడ నాగారణి తెలిపారు. కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో ఇటీవల అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లా ప్రగతికి ప్రస్తావించిన అంశాలపై జిల్లా అధికారులకు కలెక్టర్ శుక్రవారం దిశ నిర్దేశం చేశారు. మహిళా గ్రూపులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న వివిధ రుణాలను సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. పిల్లలకు ఉన్నత చదువులు చదివించాలని ఎక్కువ డబ్బు ఫీజుల రూపేణా చెల్లించి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇంజినీరింగ్ వంటి కోర్సులు కన్నా ఐటిఐ, పాలిటెక్నిక్ వంటి కోర్సులు తక్కువ ఖర్చుతో పూర్తవ్వడమే కాకుండా, ఉద్యోగావకాశాలు నూరు శాతం ఉన్నాయని, ఈ విషయమై తల్లిదండ్రులకు ప్రత్యేక అవగాహన కల్పించాలని తెలిపారు. వ్యవసాయం, హార్టీకల్చర్ వేస్టేజ్‌ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఆలోచించాలన్నారు. జెసి టి.రాహుల్ కుమార్‌రెడ్డి, డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.

లంక భూములు దళితులకు పంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెనుగొండ

వశిష్ట గోదావరి సిద్ధాంతం పెరుగులంక భూముల్లో మట్టి అక్రమ తవ్వకాలు ఆపాలని, దళితులు, పేదలకు ఆ భూములు పంచాలని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కేతా గోపాలన్ మాట్లాడుతూ సహజ సిద్ధంగా గోదావరి పరివాహక ప్రాంతంలో ఏర్పడిన లంకలను కొంతమంది వ్యాపారులతో కుమ్మక్కై ఎప్పటికప్పుడు అక్రమంగా తవ్వేస్తున్నారని తెలిపారు. ఈ తవ్వకాల వలన రైతులు పండించుకునే సీ పట్టా భూములకు నష్టం జరుగుతుందని తెలిపారు. ఆ భూములు దళిత పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లంక మట్టి అక్రమ తవ్వకాలపై సన్నాహాలు చేసుకున్న వాటిపై సిపిఎం తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసిన వెంటనే తవ్వకాలు నిలిచిపోయాయన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పెరుగు లంక భూములు పంచి వారి ఆర్థిక స్థితిగతులు మార్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుసుమే వెంకటేశ్వరరావు, గుమ్మడి రాజు, గెడ్డం నాగేశ్వరరావు, గెడ్డం ప్రభాకర్‌రావు, బత్తుల శ్రీను, చింతా శ్రీను, గుమ్మడి భాను, గెడ్డం చంటి కుసుమే నవీన్, నేలపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు

వేలం పాట వాయిదా

నరసాపురం:పట్టణంలోని మార్కెట్ ప్రాంతంలో వ్యాపారులు, కబేళాలో రోజువారీ పన్ను వసూలు చేసుకునే హక్కు కల్పించేందుకు నిర్వహించిన వేలం పాట మూడోసారి వాయిదా వేశారు. మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం కమిషనర్ ఎం.అంజయ్య ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించగా ప్రారంభ ధర ఎక్కువగా ఉందని ఎవరూ పాడేందుకు ముందుకు రాలేదు. దీంతో ఈ నెల 29న ఉదయం 11 గంటలకు తిరిగి సీల్డు టెండర్, బహిరంగ వేలం పాట నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు

గ్యాస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తహశీల్దార్‌కు సిఐటియు నేతల వినతి

ప్రజాశక్తి - పెనుమంట్ర

పెనుమంట్ర, పెనుగొండ మండలాల్లో హెచ్‌పి గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసే కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు మండల కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు శుక్రవారం తహశీల్దార్ వై.రవికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. మార్టేరులోని హెచ్‌పి గ్యాస్ శ్రీసత్యలక్ష్మి గ్యాస్ కంపెనీ నుంచి దశాబ్దాల కాలంగా పలువురు కార్మికులు ఎండా, వాన తెలీకుండా శ్రమిస్తున్నారని తెలిపారు. వారి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కోడి శ్రీనివాస్ ప్రసాద్, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు కె.సుబ్బరాజు, హెచ్‌పి గ్యాస్ కార్మికులు సిహెచ్.వెంకన్నబాబు, బి.రాజు, వి.పీటర్, ఎం.శ్రీనివాస్, బి.రమేష్ పాల్గొన్నారు.


నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

గుమస్తాల సంఘం కార్యవర్గ ఎన్నిక

నరసాపురం:నరసాపురం కోర్టు ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం న్యాయవాది గుమస్తాల సంఘం ఎన్నిక జరిగింది. నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రెసిడెంట్‌గా చిందాడి నిరీక్షణరావు, వైస్ ప్రెసిడెంట్‌గా మద్దాల బ్రహ్మయ్య, కార్యదర్శిగా లోకం శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శిగా బద్దె జయరాజు, కోశాధికారిగా కోటిపల్లి వీర వెంకట సత్యనారాయణ, ఎక్స్‌క్యూటివ్ మెంబర్స్‌గా కలిదిండి విజయకుమార్ రాజు, ఎంఎంఎన్ ఆచార్యులు, తణుకు ఆనంద నరేష్ కుమార్ ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని పలువురు ప్రముఖులు అభినందించారు.

రైతులకు రూ 9.54 కోట్ల పంట నష్టం ఇవ్వాలి

భీమవరం :జిల్లాలో గత సార్వా పంట నష్టం రూ.9.54 కోట్లు ఇప్పటివరకూ అందించకపోవడం దారుణమని, తక్షణం పంట నష్టాన్ని అందించాలని ఎపి కౌలు రైతుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మామిడి శెట్టి రామాంజనేయులు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత సార్వా సాగు సమయంలో అధిక వర్షాలకు జిల్లాలో 17 మండలాల్లో 135 గ్రామాల్లో 10 వేల 9 వందల ఎకరాలు పైబడి పంటలు ముంపునకు గురై దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఈ సమయంలో వ్యవసాయ అధికారులు 8729 మందికి రూ.9 కోట్ల 54 వేల పంట నష్టం అంచనాలు పంపారని తెలిపారు. ఇటీవల కేంద్రం నుండి రాష్ట్రానికి విపత్తుల నష్టపరిహారం కింద రూ.800 కోట్ల పైబడి వచ్చిందని, అయినా ప్రభుత్వానికి నష్టపరిహారం ఇచ్చేందుకు చేతులు రావడంలేదని విమర్శించారు. ఇబ్బందుల్లో ఉన్న కౌలురైతులు, సొంత సాగుదారులకు తక్షణం పంటనష్టం, అన్నదాత సుఖీభవ నిధులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నాయీ బ్రాహ్మణులు సంఘటితంగా పోరాడాలి

భీమవరం టౌన్:నాయీ బ్రాహ్మణులు సంఘటితంగా పోరాడాలని. అందుకు యువత ప్రధానంగా కృషి చేయాలని ఎపి నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సంస్కృతిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పివి.రమణయ్య సూచించారు. శుక్రవారం భీమవరంలోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్‌ను సందర్శించి మాట్లాడారు. జిల్లా సంఘంతో పాటు మండల, పట్టణస్థాయి సంఘాలు కూడా మరింత పటిష్టంగా ఉండాలన్నారు. అలాగే సంఘం పట్టణ అధ్యక్షులు మల్లువలస రఘుబాబు, మల్లువలస రాము, వేపాడు పెద్దిరాజు, గోడపువలస ఏసు మాట్లాడారు. అనంతరం రమణయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు ఎంవి.సత్యనారాయణ, కార్యదర్శి సిహెచ్.బంగారరావు పాల్గొన్నారు.

IN THE COURT OF THE AGENT TO GOVERNMENT (DISTRICT COLLECTOR) BHADRADRI KOTHAGUDEM DISTRICT M.O.P.No. 67/2024

బిట్వీన్ :
పెద్దాడ సాయికృష్ణ కాంత్ ......పిటీషనర్
మరియు :
పెద్దాడ ఉషారాణి అలియాస్ సిరిగినీడి ఉషారాణి
......రెస్పాండెంట్

టు
పెద్దాడ ఉషారాణి అలియాస్ సిరిగినిడి ఉషారాణి, భర్త: సాయికృష్ణ కాంత్, వయస్సు: 26సం॥లు, వృత్తి: గృహిణి, నివాసం: ఇంటి నెం.3-3-21, నియర్, జగన్నాథస్వామి టెంపుల్, రుస్తుంవాడ, వేవర్స్ కాలనీ, వార్డు నెం.13, నర్సాపురం గ్రామం మరియు ముండలం, పశ్చిమగోదావరి జిల్లా.

నోటీసులు

పైన తెలిపిన కేసులో పిటీషనరు మీ నుండి విడాకులు కోరుతూ మీపై హిందు వివాహ చట్టం ప్రకారం కేసు దాఖలు చేసినారు. అట్టి కేసులో మీకు ఎన్నిపర్యాయములు కోర్టు ద్వారా నోటీసులు పంపినను మీరు తీసుకొనకుండా కావాలని తప్పించుకొని తిరుగుచున్నారు. ఇట్టి కేసులో మీ హాజరు నిమిత్తం **తేది:11-04-2025న ఉదయం10-30గం॥లకు** గౌ॥ కోర్టు వారు వాయిదా వేసియున్నారు. ఆ రోజున మీరు స్వయముగా గానీ, మీ న్యాయవాది కానీ హాజరై మీ సమాధానం తెలుపుకొనగలరు. అట్లు మీరు హాజరుకాని పక్షంలో కోర్టు వారు మీ పరోక్షమున తీర్పు ఇవ్వగలరు.

వాయిదా: 11-04-2025

//కోర్టు వారి ఆదేశాల మేరకు//

జనపరెడ్డి గోపీకృష్ణ,
కొత్తగూడెం న్యాయవాది
21-03-2025 కొత్తగూడెం-భద్రాద్రి కొత్తగూడెం జిల్లా

పాలకొల్లు పురపాలక సంఘం

ఆర్.ఓ.సి. నెం. 200/2025/ఇ1 ది.28-03-2025

ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు నోటీసు

పాలకొల్లు పురపాలక సంఘ పరిధిలోని (1) 21వ వార్డులో ఆసుపత్రి ఏరియా నందు అప్రోచ్ CC రోడ్డును ఏర్పాటు చేయుటకు (2) 3వ వార్డు హెడ్ వాటర్ వర్క్స్ నందు గల బాలెన్స్ Clarifioculator Bridge ఏర్పాటు చేయుటకు (3) వీధి దీపముల రిపేర్లు మరియు నిర్వహణ మున్సిపల్ ఆఫీసు, మున్సిపల్ బిల్డింగ్స్ నందు ఎలక్ట్రికల్ రిపేర్లు కొరకు అవుట్ సోర్సింగ్ (టెక్నికల్) సిబ్బంది సరఫరా కొరకు నిమిత్తం (4) 27వ వార్డులోని అంబేద్కర్ భవనం నందు 125 KVA డీజిల్ జనరేటర్ సెట్ సప్లయ్, డెలివరి మరియు installation చేయు నిమిత్తం (4 పనులకు) గాను అంచనాలు విలువ సుమారు రూ. 1,05,66,000/- లతో ఇ-ప్రొక్యూర్ మెంటు ద్వారా షార్టు టెండర్లు కోరడమైనది. టెండరు షెడ్యూలు ఇ-ప్రొక్యూర్ మెంటు మార్కెట్ నందు ది. 29-03-2025వ తేది సాయంత్రం గం. 4-00 ని.ల నుండి లభించును. మిగిలిన వివరములు ఇ-ప్రొక్యూర్ మెంటు మార్కెటు www.tender.apeprocurement.gov.in లేదా కమిషనరు, పాలకొల్లు పురపాలక సంఘము, పాలకొల్లు, పశ్చిమ గోదావరి జిల్లా వారిని సంప్రదించగలరు.

కమీషనరు,
పాలకొల్లు పురపాలక సంఘం

క్రిటికల్ కేర్ యూనిట్ల ఏర్పాటుకు రూ.188 కోట్లు : మంత్రి

భీమవరం:రాష్ట్రంలో క్రిటికల్ కేర్ యూనిట్ల ఏర్పాటుకు రూ.188.75 కోట్లు మంజూరైనట్లు ఉక్కు భారీ పరిశ్రమల శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ ఇన్ఫ్రాస్ట్రక్చర్‌లో రాష్ట్రంలో ఐదుచోట్ల క్రిటికల్ కేర్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నామని, దీనిలో భాగంగా భీమవరంలో రూ.23.75 కోట్లతో ఏర్పాటు చేస్తామని తెలిపారు. వచ్చే ఏప్రిల్‌లో శంకుస్థాపన చేసే విధంగా చర్యలు చేపట్టామని తెలిపారు. స్థానిక బిజెపి పార్లమెంటు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసరావు మాట్లాడారు. అమృత భారత్ పథకంలో 72 రైల్వే స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు గుర్తించడం జరిగిందని, దీనిలో నరసాపురం, తాడేపల్లిగూడెం, భీమవరం రైల్వే స్టేషన్లను సుమారు రూ.90 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ పనులు ఎప్పటికి 50 శాతం పూర్తయ్యాయని తెలిపారు. నరసాపురం నుండి నాగర్‌సోల్ వెళ్లే ఎక్స్‌ప్రెస్‌ను వీరవాసరం స్టేషన్లో హాల్ట్ ఇవ్వడానికి వందే భారత్ రైలును రైలు మెయిన్ లైన్‌లో తాడేపల్లిగూడెంలో హాల్ట్ ఇవ్వడానికి కృషి చేస్తున్నారన్నారు.

స్వయం ఉపాధి ఇంటర్వ్యూలకు 732 మంది హాజరు

గణపవరం:మండలంలో స్వయం ఉపాధి సోపానం ఇంటర్వ్యూకు 956 మంది దరఖాస్తులు చేసుకోగా శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో జరిగిన ఇంటర్వ్యూలకు 732 మంది హాజరయ్యారని ఎంపిడిఒ ఆర్.బేబిలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచే ఇంటర్వ్యూలు ప్రారంభమైనట్లు చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ వైకెవి.అప్పారావు, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైసిపికే మెజార్టీ : కారుమూరి నాగేశ్వరరావు

తణుకు:రాష్ట్రంలో మెజార్టీ వైసిపికే మద్దతుగా ఉన్నారని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అత్తిలి ఎంపిపి ఎన్నిక వాయిదా నేపథ్యంలో స్థానిక నివాసం వద్ద విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కారుమూరి మాట్లాడుతూ వైసిపినే గెలిపించుకోవాలని చూస్తున్నారన్నారు. అత్తిలి మండలంలో మొత్తం 20 మంది ఎంపిటిసిలు ఉండగా వారిలో 13 మంది వైసిపి వారేనని, ఆరుగురు టిడిపి, జనసేన సభ్యులని తెలిపారు. అత్తిలిలో ఎన్నికల సమయంలోనే రాజకీయం, తరువాత అందరం అన్నదమ్ముల భావంతో కలిసి వెళ్లిపోయే పరిస్థితి ఉండేదని అన్నారు. కానీ కొత్త సంస్కృతిని ఎంఎల్ఎ రాధాకృష్ణ తీసుకోచ్చారన్నారు. మాజీ మంత్రిగా, బిసి నాయకుడుగా నిన్న ఎంపిటిసిలు అందరూ విప్ జారీ చేసి 13 మంది నా ఇంటికి వచ్చి బయలుదేరే సమయంలో దౌర్జన్యంగా కాండ సృష్టించి అరాచకంగా నా ఇంటి మీదకొచ్చి దుర్మార్గం చేయించాడు రాధాకృష్ణ అని విమర్శించారు.

ఒలింపియాడ్‌లో మాంటిస్సోరి ప్రతిభ

పాలకొల్లు :పాలకొల్లు లజపతిరాయ పేటలోని మాంటిస్సోరి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులకు గత నెలలో నిర్వహించిన చింతన నేషనల్ ఒలింపియాడ్‌లో మాథమాటిక్స్, సైన్సు, ఇంగ్లీష్ విభాగాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకున్నట్లు పాఠశాల హెచ్ఎం ఎస్‌పిఎస్.ప్రకాష్ తెలిపారు. విద్యార్థులకు రెగ్యులర్ సిలబస్‌తో పాటు ఐఐటి ఫౌండేషన్, ఇ - లెర్నింగ్, ఒలింపియాడ్స్ కోచింగ్ వంటి వివిధ అంశాల పట్ల శ్రద్ధ తీసుకుని ప్రత్యేక శిక్షణ అందించడం ద్వారా ప్రతి సంవత్సరమూ తమ స్కూల్ విద్యార్థులు క్రమం తప్పకుండా రాష్ట్ర స్థాయి బహుమతులు అందుకుంటున్నారని స్కూల్ అకడమిక్ డైరెక్టర్ కెవి కృష్ణవర్మ అన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు చింతన ఒలింపియాడ్ ఫౌండేషన్ వారు అందించిన, మెరిట్ సర్టిఫికెట్లను, మెడల్స్, మెమెంటోలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

గ్రామపంచాయితీ కార్యాలయం - మార్టేరు
పెనుమంట్ర మండలం.

ర.క.నెం. /2025 **టెండర్ నోటీసు** 29/03/2025

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, **మార్టేరు గ్రామ పంచాయితీ**కి 2025-2026 సం॥నకు ఈ క్రింది తెల్పిన ప్రకారం **ది.01-4-2025 తేదీ నుండి 31-03-2026వ తేది వరకు,** అనగా ఒక సంవత్సరంనకు కాలపరిమితి కాంట్రాక్టు పద్ధతిపై సేవలు అందజేయుటకు మరియు ఈ దిగువ అయిటెంలకు సంబంధించి సామానులు సరఫరా చేయు నిమిత్తం, టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను **ది.07-04-2025 సోమవారం ఉదయం 11.00 నుండి మధ్యాహ్నం 2.00 గంటల వరకు** తీసుకోబడి, అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షంలో టెండర్లు తెరవబడును. అర్హత కలిగిన వ్యక్తులు ఏజెన్సీల టెండర్లు, నిబంధనలను అంగీకరించి, తమ టెండరు దరఖాస్తులను సమర్పించవలెను. పూర్తి ఇతర వివరములు కోరు వారు గ్రామపంచాయితీ కార్యాలయం పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	షెడ్యూలు వివరములు	చెల్లించవలసిన ధరావత్తు ఒక్కింటికి
1.	పారిశుద్ధ్య నిర్వహణ - 12 మంది	రూ.50/- లు చొ॥న
2.	మంచినీటి సరఫరా నిర్వహణ - 2	రూ.50/- లు చొ॥న
3.	వీధి దీపముల రిపేరు పనులు - ఎలక్ట్రీషియన్-1	రూ.50/- లు చొ॥న
4.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన వీధి దీపములకు ఎల్.ఇ.డి సెట్స్/ఎల్.ఇ.డి. స్పేర్‌పార్ట్స్ తదితర సామానులు సరఫరా చేయుటకు.	రూ.100/- లు చొ॥న
5.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన పారిశుద్ధ్య సామానులు సరఫరా చేయుటకు.	రూ.100/- లు చొ॥న
6.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన వీధి వాటర్ వర్క్స్ సామానులు, చేతి పంపుల వీడి భాగములు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న
7.	2025-26 సం॥గాను పంచాయితీకి అవసరమైన స్టేషనరీ సామానులు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న
8.	2025-26 సం॥గాను పంచాయితీకి అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందికి వాటర్ వర్క్స్ సిబ్బందికి, అటెండర్‌కు బట్టలు, చెప్పులు, జోళ్ళు, కొబ్బరి నూనె, సబ్బులు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న

నోట్ : పై 4 నుంచి 8 అయిటమ్స్ సప్లయ్‌దారులకు గ్రామ పంచాయితీ విధుల నిర్వలను బట్టి చెల్లింపులు జరుగును.

సం/- మట్టా కుమారి రాము, సర్పంచ్, గ్రామ పంచాయితీ, మార్టేరు, పశ్చిమ గోదావరి జిల్లా.
సం/- కావాడి సత్యనారాయణ, కార్యదర్శి, గ్రామ పంచాయితీ, మార్టేరు, పశ్చిమ గోదావరి జిల్లా.

గ్రామపంచాయితీ కార్యాలయం - పొలమూరు
పెనుమంట్ర మండలం.

ర.క.నెం. /2025 **టెండర్ నోటీసు** 29/03/2025

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుమంట్ర మండలం, **పొలమూరు గ్రామ పంచాయితీ**కి 2025-2026 సం॥నకు ఈ క్రింది తెల్పిన ప్రకారం **ది.01-4-2025 తేదీ నుండి 31-03-2026వ తేది వరకు,** అనగా ఒక సంవత్సరంనకు కాలపరిమితి కాంట్రాక్టు పద్ధతిపై సేవలు అందజేయుటకు మరియు ఈ దిగువ అయిటెంలకు సంబంధించి సామానులు సరఫరా చేయు నిమిత్తం, టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లను **ది.08-04-2025 మంగళవారం ఉదయం 11.00 నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు** తీసుకోబడి, అదే రోజు మధ్యాహ్నం 3.00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదార్ల సమక్షంలో టెండర్లు తెరవబడును. అర్హత కలిగిన వ్యక్తులు ఏజెన్సీల టెండర్లు, నిబంధనలను అంగీకరించి, తమ టెండరు దరఖాస్తులను సమర్పించవలెను. పూర్తి ఇతర వివరములు కోరు వారు గ్రామపంచాయితీ కార్యాలయం పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును.

వ.నెం.	షెడ్యూలు వివరములు	చెల్లించవలసిన ధరావత్తు ఒక్కింటికి
1.	పారిశుద్ధ్య నిర్వహణ - 4 గురు	రూ.50/- లు చొ॥న
2.	ఏజెన్సీ ద్వారా పారిశుద్ధ్య నిర్వహణ - 1 ఏజెన్సీ	రూ.50/- లు చొ॥న
3.	మంచినీటి సరఫరా నిర్వహణ పథకం ట్యాంకు ఆపరేటర్ - 3 గురు	రూ.50/- లు చొ॥న
4.	వీధి దీపముల రిపేరు పనులు - ఎలక్ట్రీషియన్-1	రూ.50/- లు చొ॥న
5.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన వీధి దీపములకు ఎల్.ఇ.డి సెట్స్/ఎల్.ఇ.డి. స్పేర్‌పార్ట్స్ తదితర సామానులు సరఫరా చేయుటకు.	రూ.100/- లు చొ॥న
6.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన పారిశుద్ధ్య సామానులు సరఫరా చేయుటకు.	రూ.100/- లు చొ॥న
7.	2025-26 సం॥నకు గాను పంచాయితీకి అవసరమైన వీధి వాటర్ వర్క్స్ సామానులు, చేతి పంపుల వీడి భాగములు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న
8.	2025-26 సం॥గాను పంచాయితీకి అవసరమైన స్టేషనరీ సామానులు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న
9.	2025-26 సం॥గాను పంచాయితీకి అవసరమైన పారిశుద్ధ్య సిబ్బందికి వాటర్ వర్క్స్ సిబ్బందికి, అటెండర్‌కు బట్టలు, చెప్పులు, జోళ్ళు, కొబ్బరి నూనె, సబ్బులు సరఫరా చేయుటకు	రూ.100/- లు చొ॥న

నోట్ : పై 5 నుంచి 9 అయిటమ్స్ సప్లయ్‌దారులకు గ్రామ పంచాయితీ విధుల నిర్వలను బట్టి చెల్లింపులు జరుగును.

సం/- కాకర రాజేశ్వరరావు, సర్పంచ్, గ్రామ పంచాయితీ, పొలమూరు, పశ్చిమ గోదావరి జిల్లా.
సం/- కావాడి సత్యనారాయణ, కార్యదర్శి, గ్రామ పంచాయితీ, పొలమూరు, పశ్చిమ గోదావరి జిల్లా.